RNI NO.TELTEL/2023/87655

# దీక్ష ప్రభ

తెలుగు దినపత్రిక

16-04-2026
గురువారం, హైదరాబాద్

సంపుటి: 04 । సంచిక: 13
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.deekshaprabhadaily.com



పర్యాటక ప్రదేశాలకు
## తెలంగాణ నిలయం

# దేశంలో నక్సలిజం అంతమైంది

- మావోయిస్టు ప్రభావిత జిల్లాలు లేవు
- కేంద్రం అధికారిక ప్రకటన
- సమాజంలో అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయి
- హింస ద్వారా కాకుండా చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది
- జనజీవన స్రవంతిలో కలిసిన వారికి ప్రయోజనాలను అందిస్తాం.. పునరావాసం కల్పిస్తాం
- నక్సలిజాన్ని సమర్థించే వారు ఈ విషయాన్ని తెలుసుకోవాలి: అమిత్ షా

ఐదు దశాబ్దాలకు పైగా దేశాన్ని పీడించిన నక్సలిజం అంతమైందని కేంద్రం అధికారిక ప్రకటన చేసింది. దేశంలో ఇప్పుడు నక్సల్స్ ప్రభావిత జిల్లా ఏదీ లేదని కేంద్ర హోం శాఖ రాష్ట్రాలకు అధికారికంగా సమాచారం పంపింది. ఈ మేరకు తొమ్మిది రాష్ట్రాలకు లేఖలు రాసిన కేంద్రం, మార్చి 31 నాటికి దేశం నక్సల్ నుంచి విముక్తి పొందిందని పేర్కొంది. గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్, ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాల్లో కూడా ఇప్పుడు హింస నియంత్రణలోకి వచ్చిందని కేంద్రం తెలిపింది.



2

# భూసేకరణపై నిరసన

- వికారాబాద్‌లో కవిత అరెస్టు
- ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోంది
- భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తాం
- తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలన్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



2

ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్ చట్టంలో మార్పుల పేరిట ఓబీసీల హక్కులను హరిస్తూ వారి వాటాను చోరీ చేస్తున్నారని ఆరోపించారు. డిలిమిటేషన్ ద్వారా అధికారాన్ని కేంద్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు చర్యలూ దేశద్రోహ కార్యకలాపాలేనని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు గురువారం పార్లమెంటు ముందుకు రానున్న నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఈ మేరకు వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగనివ్వబోమన్నారు.రాజ్యాంగంలో భాగమైన మహిళ బిల్లును 2023లో పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు రాహుల్ తెలిపారు. ప్రభుత్వం ఇప్పుడు ప్రతిపాదించిన సవరణలు మహిళా రిజర్వేషన్లకు సంబంధమే లేదన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు నిజంగా చేయాలనుకుంటే 2026 జనగణన ఆధారంగా ముందుకెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. అలా చేస్తే కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. దేశంలో వెనుకబడిన వర్గాలు సుమారు 50 శాతం ఉన్నప్పటికీ వారికి తగిన ప్రాతినిధ్యం ఇవ్వకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన అన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణ, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు తీవ్ర నష్టం కలుగుతుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. వారి ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

# మోడీ దేశద్రోహ చర్యలు

మహిళా రిజర్వేషన్ చట్టంలో మార్పుల పేరిట ఓబీసీల హక్కులను హరిస్తున్నారు

డీలిమిటేషన్ ద్వారా అధికారాన్ని కేంద్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు

- ఈ ప్రక్రియ వల్ల దక్షిణ, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు తీవ్ర నష్టం
- 50 శాతం ఉన్న బీసీలకు ప్రాతినిధ్యం ఇవ్వకుండా కుట్ర
- పాత డేటా వద్దు.. 2026 కులగణన డేటాప్రకారం జరగాలి..
- బీసీలకు అన్యాయం జరగనివ్వం
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

2





2

వడదెబ్బ బాధితులకు
## సత్వరమే చికిత్స అందించాలి

- ఎండల తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలి
- తక్షణమే చికిత్స అందించేందుకు అన్ని ఆసుపత్రుల్లో ఇప్పటికే ఏర్పాట్లు చేశాం
- పెద్ద ఆసుపత్రులలో ప్రతి బ్లాక్‌లో, ప్రతి ఫ్లోర్‌లో డ్రింకింగ్ వాటర్ సౌకర్యం ఉండాలి
- రోగులకు, డాక్టర్లకు ఇబ్బంది కలగకుండా ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలి
- ఐసీయూలలో ఏసీలు సక్రమంగా పనిచేసేలా చూడాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ





2

కుల సర్వే నివేదిక విడుదలకు
## ప్రభుత్వం సిద్ధం

- ఈ సర్వే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా ముగిసింది
- రాష్ట్రంలోని ప్రతి గడపకూ వెళ్లి వివరాలు సేకరించాం
- ఇప్పటివరకు 97.10 శాతం సమగ్ర సర్వే పూర్తయింది
- మిగిలిన స్వల్ప శాతాన్ని కూడా త్వరితగతిన క్రోడీకరిస్తున్నాం
- 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో అత్యంత పకడ్బందీగా నమోదు చేశాం



2

తెలంగాణలో కాంగ్రెస్ నేతలకు
## శుభవార్త

- నామినేటెడ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్ భేటీ
- తాజా రాజకీయ పరిణామాలపై చర్చ


డీలిమిటేషన్‌పై బీఆర్ఎస్
# వైఖరి స్పష్టం

- మహిళా రిజర్వేషన్ బిల్లును నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టొద్దు
- మహిళా రిజర్వేషన్లకు బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ సంపూర్ణ మద్దతు ఇస్తోంది
- కేంద్రం పార్లమెంటులో ప్రవేశ పెడుతున్న బిల్లులో స్పష్టత లేదు
- కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి అస్పష్టమైన నిబంధనలు పెడుతున్నారు
- దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ఊరుకోబోం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





2



2

గ్లోబల్ హబ్‌గా
## తెలంగాణ ఎదుగుతోంది

- నైపుణ్యాధారిత కోర్సులను, వినూత్న సిలబస్‌ను ప్రవేశపెట్టాం
- విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి
- టీజీసీహెచ్ఈ చైర్మన్ బాలకిష్టారెడ్డితో న్యూకాసిల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం భేటీ
- 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ', ఏఐ యూనివర్సిటీ, 'ఫ్యూచర్ సిటీ' వివరించిన చైర్మన్

మార్కెట్ యార్డుల్లో
# 'జీరో బిజినెస్' జరగొద్దు

- అక్రమాలకు పాల్పడే ట్రేడర్ల లైసెన్సులు రద్దు చేయడానికి వెనుకాడవద్దు
- అధికారులు సహకరిస్తే వారిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం
- మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు సౌకర్యాలను ప్రాధాన్యత క్రమంలో కల్పించాలి : మంత్రి తుమ్మల



2

# భూసేకరణపై నిరసన..



**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** వికారాబాద్ జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రైతుల పోరాటం ఉగ్రరూపం దాల్చింది. పోలీసులు, రైతులకు మధ్య జరిగిన తోపులాటతో పరిస్థితి ఒక్కసారిగా రణరంగంగా మారింది. దీంతో రైతులకు మద్దతుగా పరిగి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పరిగి ప్రాంతంలో పరిశ్రమల స్థాపన కోసం తమ సారవంతమైన భూములను లాక్కోవద్దంటూ రైతులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ పోరాటానికి అండగా నిలిచిన కవిత, బుధవారం వందలాది మంది రైతులతో కలిసి ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు భారీగా మోహరించి రైతులను అడ్డుకోవడంతో ఉద్రిక్తత మొదలైంది. ధర్నా నిర్వహిస్తున్న కవితను పోలీసులు అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా, రైతులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గంటల తరబడి తోపులాట జరిగింది. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో పోలీసులు కవితను బలవంతంగా వాహనం నుంచి కిందకు దించి, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా తరలించారు. ఆమె వాహనాన్ని కూడా అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. అరెస్టుకు ముందు కవిత మాట్లాడుతూ.. "రైతుల పొట్ట కొట్టి పరిశ్రమలు కట్టడం ఏంటని?" ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులు ప్రాణాలకు తెగించి తమ భూములను కాపాడుకుంటుంటే, వారిపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం కవిత అరెస్టుతో వికారాబాద్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఎక్కడికక్కడ జాగృతి శ్రేణులు రాస్తారోకోలు చేపట్టడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా కేంద్రంలో అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

## మోడీ దేశద్రోహ చర్యలు



(మొదటి పేజీ తరువాయి)

అనుకుంటున్నారని రాహుల్ గాంధీ అన్నారు. 'ఎప్‌స్టీన్ ఫైళ్ల గురించి మోడీ భయపడుతున్నారని నాకు తెలుసు. 35లక్షల ఫైళ్లు యూఎస్‌లో ఉన్నాయి. వాటి తాళంచెవి ట్రంప్ వద్ద ఉందని ఆందోళన పడుతున్నారు. కానీ ఇది పద్ధతి కాదు. అనుకున్న విధంగా డీలిమిటేషన్ జరిగి బీసీలకు మోడీ అన్యాయం చేయాలనుకుంటున్నారు. అది జరగనివ్వం. పాత డేటా వద్దు. 2026 కులగణన డేటాప్రకారం జరగాలి. బీసీలకు అన్యాయం జరగనివ్వం. బీసీలు, దళితులు, ఆదివాసీలకు వారి హక్కులు వారికి ఇవ్వండి. దక్షిణ, ఈశాన్య రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తెలిపారు.

## డీలిమిటేషన్‌పై బీఆర్ఎస్ వైఖరి స్పష్టం

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** మహిళా రిజర్వేషన్ బిల్లును నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ముడిపెట్టడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. మహిళా బిల్లు అమలులో కేంద్రం అనుసరిస్తున్న అస్పష్ట వైఖరిని ఆయన తప్పుబట్టారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్లకు బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు. అయితే, బిల్లును అమలు చేయకుండా డీలిమిటేషన్ సాకుతో కాలయాపన చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం పార్లమెంటులో ప్రవేశ పెడుతున్న బిల్లులో స్పష్టత లేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి అస్పష్టమైన నిబంధనలు పెడుతున్నారని ఆరోపించారు. డీలిమిటేషన్ పేరుతో పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ఊరుకోబోమని కేటీఆర్ హెచ్చరించారు. "దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను పాటిస్తూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అటువంటి రాష్ట్రాలకు సీట్ల పెంపులో అన్యాయం జరిగితే సహించేది లేదు. ప్రస్తుతం పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు ఉన్న 24 శాతం సీట్ల వాటాను అలాగే కొనసాగించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లను కేటాయించి, దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ప్రజల నుంచి తీవ్రమైన తిరుగుబాటు వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి విభజన రాజకీయాలు వదిలేసి, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని హితవు పలికారు. దేశ సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా అడ్డుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## పర్యాటక ప్రదేశాలకు తెలంగాణ నిలయం

**షేక్‌పేట:** దేశంలోనే అత్యద్భుత వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రదేశాలకు తెలంగాణ నిలయమని.. దేశ, విదేశీ పర్యాటకులను మరింత ఆకర్షించేలా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి షేక్‌పేట కుతుబ్‌షాహీ టూంబ్స్, గోల్కొండ కటోరా హౌస్, ఖజానా బిల్డింగ్ ఆర్కియాలజికల్ మ్యూజియంలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక ప్రదేశాల్లో సందర్శకుల కోసం మౌలిక వసతులను కల్పిస్తున్నామని అన్నారు. ఇందుకు అనుగుణంగా బడ్జెట్‌ను కేటాయిస్తున్నామని తెలిపారు.

### పర్యటన సాగిందిలా..

టూంబ్స్‌లో జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం అక్కడి ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌నూ సందర్శించారు. వక్ఫ్‌బోర్డు ట్రైబ్యునల్‌లో కేసులు ఉన్న ప్రాంతాలను మినహాయించి మిగతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని సూచించారు. టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కి.మీ. రోప్ వే ప్రాజెక్టుపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు అనుమతుల దశలో ఉందని అధికారులు వివరించారు. అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కటోరా హౌస్ మురికి కూపంగా మారిందని, పూడికలు తొలగించి పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దాలన్నారు. గోల్కొండ కోటకు వచ్చే పర్యాటకుల కోసం చార్మినార్ లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని మంత్రి ప్రతిపాదించారు. తద్వారా చేనేత, హస్త కళాకారులకు ఆదాయం కల్పించవచ్చన్నారు. అనంతరం ఖజానా బిల్డింగ్ ఆర్కియాలజికల్ మ్యూజియంను సందర్శించారు. మ్యూజియాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అక్కడ చేనేత, హస్త కళలను ప్రోత్సహించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజియం వెనుక ఉన్న ఆక్రమణలతోపాటు కటోరా హౌస్ వద్ద ఉన్న కబ్జాలను పోలీసుల సహాయంతో వారం రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, పలు విభాగాల అధికారులు ఉన్నారు.

## కుల సర్వే నివేదిక విడుదలకు ప్రభుత్వం సిద్ధం

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే తుది నివేదికను విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఇవాళ రాత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఈ సర్వే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా ముగిసిందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి గడపకూ వెళ్లి వివరాలు సేకరించినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 97.10 శాతం సమగ్ర సర్వే పూర్తయిందని, మిగిలిన స్వల్ప శాతాన్ని కూడా త్వరితగతిన క్రోడీకరిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో అత్యంత పకడ్బందీగా నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. కులగణన ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం సుమారు 1.3 లక్షల మంది ప్రభుత్వ సిబ్బందిని వినియోగించిందని మంత్రి పొన్నం వివరించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, రాజకీయ జోక్యం లేకుండా కేవలం గణాంకాల ఆధారంగానే ఈ సర్వే నిర్వహించామని చెప్పారు. నిష్పాక్షికంగా జరిగిన ఈ ప్రక్రియ తెలంగాణ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కుల గణన దేశానికే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం చేకూర్చడంలో ఈ నివేదిక కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 'మా ప్రభుత్వం సేకరించిన ఈ విలువైన డేటాను కేంద్ర ప్రభుత్వం కూడా పరిగణనలోకి తీసుకోవాలి. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాల్సిన అవసరం ఉంది' అని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు ఈ నివేదిక దిక్సూచిగా మారుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. నివేదిక విడుదలైన అనంతరం గణాంకాల ఆధారంగా భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన వెల్లడించారు.




## దేశంలో నక్సలిజం అంతమైంది



**నేషనల్ బ్యూరో, దీక్షప్రభ:** ఐదు దశాబ్దాలకు పైగా దేశాన్ని పీడించిన నక్సలిజం అంతమైందని కేంద్రం అధికారిక ప్రకటన చేసింది. దేశంలో ఇప్పుడు నక్సల్స్ ప్రభావిత జిల్లా ఏదీ లేదని కేంద్ర హోం శాఖ రాష్ట్రాలకు అధికారికంగా సమాచారం పంపింది. ఈ మేరకు తొమ్మిది రాష్ట్రాలకు లేఖలు రాసిన కేంద్రం, మార్చి 31 నాటికి దేశం నక్సల్ నుంచి విముక్తి పొందిందని పేర్కొంది. గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్, ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాల్లో కూడా ఇప్పుడు హింస నియంత్రణలోకి వచ్చిందని కేంద్రం తెలిపింది. నక్సలిజం పూర్తిగా అంతమైనా, తిరిగి అది పుట్టకుండా ఉండేందుకు కేంద్రం జిల్లాలను రెండు కేటగిరీలుగా వర్గీకరించింది. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలతో పాటు మొత్తం 37 లెగసీ అండ్ థ్రస్ట్ జిల్లాలుగా ప్రకటించింది. అక్కడ నక్సలిజం అంతమైనప్పటికీ భద్రతను పటిష్ఠం చేయడానికి అభివృద్ధిని కొనసాగించడానికి ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగించనున్నారు. ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా ఒక్కదాన్ని మాత్రమే డిస్ట్రిక్ట్ ఆఫ్ కన్సర్న్ కేటగిరీలో ఉంచారు. ఇక్కడ నక్సల్స్ వ్యవస్థ చిన్నాభిన్నమైనా, సమీప భవిష్యత్తులో నిరంతర భద్రత అవసరమని పేర్కొన్నారు.

### 'నక్సలిజం నిర్మూలన ఒక పెద్ద విజయం'..

అధికారిక గణాంకాల ప్రకారం, నక్సల్ హింసలో ఇప్పటివరకు 17 వేలకుపైగా మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో పౌరులు, భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ నేపథ్యంలో నక్సలిజం నిర్మూలనను ఒక పెద్ద విజయంగా కేంద్రం అభివర్ణిస్తోంది. మరోవైపు, దశాబ్దాలుగా వేళ్లూనుకున్న నక్సలిజం నుంచి దేశానికి విముక్తి కల్పించామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో పేర్కొన్నారు. సాయుధ తీవ్రవాద ఉద్యమానికి మూలమైన మావోయిస్టు కేంద్ర కమిటీ నిర్మాణాన్ని దాదాపు విచ్ఛిన్నం చేశామన్నారు. 'వామపక్ష తీవ్రవాదం నుంచి దేశం విముక్తికి చర్యలు' అనే అంశంపై ఆయన లోక్‌సభలో షా ప్రసంగించారు.అలాగే, మావోయిస్టుల పొలిట్‌బ్యూరో, కేంద్ర వ్యవస్థను దాదాపు తుడిచిపెట్టేశామని, దీంతో నక్సల్స్ ముప్పు నుంచి దేశం విముక్తి పొందిందని షా ఇదివరకే ప్రకటించారు. మావోయిస్టులకు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందన్నారు. అదేవిధంగా సమాజంలో అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయని, ఆయుధాలు చేపట్టడం సరైన మార్గం కాదని షా చెప్పుకొచ్చారు. హింస ద్వారా కాకుండా చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని షా పేర్కొన్నారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిసిన వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలను అందిస్తామన్నారు. పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఆయుధాలు పట్టుకుంటే మాత్రం మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నక్సలిజాన్ని సమర్థించే వారు ఈ విషయాన్ని తెలుసుకోవాలని షా అన్నారు. అలాగే ఎన్‌డీఏ వచ్చాకే గిరిజనుల జీవితాల్లో మార్పులు వచ్చాయని తెలిపారు. నక్సలిజాన్ని దెబ్బతీసిన ఘనత ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర బలగాలకే దక్కుతుందని పేర్కొన్నారు.నక్సలిజాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో మావోయిస్టులపై కేంద్రం కొన్నేళ్లుగా ఉక్కుపాదం మోపుతోంది. ఈ నేపథ్యంలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రతరం చేసింది. ఆపరేషన్ కగార్ పేరుతో చాలా మంది నక్సలైట్లను మట్టుబెట్టింది. కర్రె గుట్ట వంటి పలు ప్రాంతాల్లో నిరంతర కూంబింగ్‌తో ఆపరేషన్ చేపట్టింది. పోలీసులు కథనాల ప్రకారం, గతేడాది జనవరి నుంచి ఛత్తీస్‌గఢ్‌లో ఆయా ఎన్‌కౌంటర్‌లలో నంబాల కేశవ రావు వంటి అగ్ర నేతలతో సహా 500 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. అదే విధంగా, రాష్ట్రంలో దాదాపు 1,900 మంది నక్సలైట్లు అరెస్టయ్యారు. మరో 2,500 మందికి పైగా లొంగిపోయారు.

## గ్లోబల్ హబ్‌గా తెలంగాణ ఎదుగుతోంది

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** తెలంగాణ యువ రాష్ట్రంగా రక్షణ తయారీ, ఔషధ రంగం, ఐటీ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. వి. బాలకిష్టారెడ్డి అన్నారు. పరిశ్రమలకు, విద్యా సంస్థలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు నైపుణ్యాధారిత కోర్సులను, వినూత్న సిలబస్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఏఐ ఆధారిత ట్యూటర్లు, కోడింగ్ సపోర్ట్ వంటి అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రతిష్టాత్మక న్యూకాసిల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం మంగళవారం టీజీసీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా న్యూకాసిల్ యూనివర్సిటీ ప్రతినిధులు సింగపూర్, మలేషియా దేశాల్లో తమ ఆఫ్‌క్యాంపస్ కేంద్రాలు ఉన్నాయని, భారతదేశంలో కూడా ఆఫ్‌క్యాంపస్ కేంద్రాల స్థాపన కోసం పలు నగరాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా సైన్స్, ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్, సస్టైనబుల్ నగరాలు, అగ్రో బిజినెస్, మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే సింగపూర్, మలేషియాల్లో ఆఫ్‌క్యాంపస్ కేంద్రాలను నిర్వహిస్తున్నామని, అదే తరహాలో భారతదేశంలో కూడా కేంద్రాన్ని స్థాపించేందుకు అనువైన నగరాలను పరిశీలిస్తున్నామని న్యూకాసిల్ ప్రతినిధులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ', ఏఐ యూనివర్సిటీ, 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టుల గురించి చైర్మన్ వివరించారు. రైజింగ్ తెలంగాణ విజన్ 2047 లక్ష్య సాధనలో ఉన్నత విద్య నైపుణ్యాభివృద్ధి కీలకమని, ఇందులో న్యూకాసిల్ వంటి అంతర్జాతీయ భాగస్వామ్యాలు ఎంతో కీలకం కానున్నాయని ఆయన పేర్కొన్నారు. న్యూకాసిల్ యూనివర్సిటీ బృందం తమకున్న యుకే నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్ హెచ్ఎస్) అనుబంధాన్ని, డేటా అనలిటిక్స్, అగ్రో బిజినెస్‌లో విద్యార్థులకు అందిస్తున్న ప్రాక్టికల్ అనుభవాన్ని వివరించింది. ఈ సమావేశం అత్యంత సానుకూల వాతావరణంలో ముగిసింది. భవిష్యత్తులో పరస్పర సహకారానికి మార్గాలను అన్వేషించాలని ఇరువర్గాలు నిర్ణయించుకున్నాయి. ఈ బృందంలో ప్రొఫెసర్ స్టీవర్ట్ రాబిన్సన్ (డీన్, ఆపరేషనల్ రీసెర్చ్), డాక్టర్ ఆదిత్య నారాయణ్ శర్మ (గ్లోబల్ స్పెషల్ అడ్వైజర్ - ఇండియా), శ్రీ బ్యారీ హోడ్గ్‌సన్ (డిప్యూటీ డైరెక్టర్, నేషనల్ ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డేటా), సంజనా మెడిపల్లి (హెడ్ ఆఫ్ ఇంటర్నేషనల్ పార్ట్‌నర్‌షిప్) పాల్గొన్నారు.



## మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' జరగొద్దు



**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలలో మార్కెట్ రుసుము వసూళ్లను పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో మార్కెటింగ్ యార్డులలో రూ. 568.50 కోట్లతో 630 అభివృద్ధి పనులను ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటిలో రూ. 128 కోట్ల విలువైన 113 పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. బుధవారం సచివాలయంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంకా కొన్ని చోట్ల జీరో బిజినెస్ జరుగుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వస్తోందని, దీనిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అక్రమాలకు పాల్పడే ట్రేడర్ల లైసెన్సులు రద్దు చేయడానికి వెనుకాడవద్దని, దీనికి ఎవరైనా అధికారులు సహకరిస్తే వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, వాటి పురోగతిని ప్రతిరోజూ సమీక్షించేలా ఒక డాష్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు అవసరమైన సౌకర్యాలను ప్రాధాన్యత క్రమంలో కల్పించాలని సూచించారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీలో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' సాఫ్ట్‌వేర్ పనితీరును పరిశీలించి, ఫలితాలు ఆశాజనకంగా ఉంటే అన్ని మార్కెట్ యార్డులను డిజిటలైజేషన్ చేసి జీరో బిజినెస్‌ను అరికట్టాలని పేర్కొన్నారు. కోహెడ పండ్ల మార్కెట్ పనులకు సంబంధించి సర్వే పూర్తయిందని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి పనికి ప్రారంభ తేదీ, గడువు తేదీని నిర్ణయించుకుని నిర్దిష్ట కాలపరిమితిలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు గ్రిడ్ అనుసంధానంతో కూడిన సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. జూలై చివరికల్లా ఈ పనులు పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన తార్పాలిన్లు, తేమ కొలిచే పరికరాలు, క్లీనింగ్ డ్రైయర్లను అన్ని కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పండించిన రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరిపి, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముఖ్యమంత్రి అనుమతితో నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కార్యదర్శి సురేంద్ర మోహన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ నేతలకు శుభవార్త

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** తెలంగాణలో కాంగ్రెస్ నేతలకు శుభవార్త అందింది. త్వరలోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. దీంతో ఎప్పటి నుంచో నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్న ఆశావహుల్లో ఇప్పుడు కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. అయితే ఈ నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో పార్టీ కోసం పనిచేసిన వారు, సామాజిక సమీకరణాలను ఆధారంగా చేసుకుని.. నియమించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అసమ్మతి రేగకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ త్వరలోనే మొదలు కానుంది. దీంతో గంపెడు ఆశలతో ఉన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు.. ఇప్పుడు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ భేటీ అయి.. నామినేటెడ్ పోస్టుల భర్తీ, అభ్యర్థుల ఎంపిక వంటి పలు విషయాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే నామినేటెడ్ పోస్టులను వీలైనంత తొందరగా భర్తీ చేసేందుకు.. ఈ కసరత్తు ప్రక్రియకు సీఎం రేవంత్ రెడ్డి పచ్చజెండా ఊపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం.. పార్టీ అభివృద్ధి కోసం నిత్యం శ్రమించిన నాయకులను గుర్తించి వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇక ఈ నామినేటెడ్ పదవులను కేటాయించడంలో సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఎవరికీ అన్యాయం జరగకుండా.. అన్ని వర్గాలను పరిగణలోకి తీసుకుని.. సమన్యాయం జరిగేలా ఆశావహుల జాబితాను తయారు చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ భేటీలో ప్రధానంగా టీపీసీసీ కమిటీ కూర్పుపై దృష్టి పెట్టారు. వీటితోపాటు కార్పొరేషన్ చైర్మన్ పదవులు, జిల్లా స్థాయి కమిటీల భర్తీపైనా తుది నిర్ణయం తీసుకున్నారు. ఇక ఇప్పటికే జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుల లిస్టును పార్టీ హైకమాండ్ రెడీ చేసింది. అర్హత, కష్టపడేతత్వం ఉన్న వారికే ఈ పోస్టుల్లో ప్రాధాన్యతనివ్వాలని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఇందులో గ్రూపు రాజకీయాలకు ఎలాంటి ఆస్కారం లేకుండా కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపిక జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.






# జడ్పిహెచ్ఎస్ స్థలానికి పూర్తి రక్షణ కల్పించాలి

- సిఎస్ఆర్ నిధులతో హై స్కూల్ భవనం నిర్మించాలి
- అన్యాక్రాంతమైన 9 గుంటల పాఠశాల స్థలాన్ని స్వాధీన పరుచుకోవాలి
- తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (టీఎస్ఈసీ), పూర్వ విద్యార్థులు

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** జెడ్పిహెచ్ఎస్ పటాన్ చెరు పాఠశాల స్థలాన్ని రక్షించాలని, ఈ మధ్య కాలంలో పాఠశాల కాంపౌండ్ వాల్ తో పాటు పాత భవనాన్ని కూల్చి వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ, పటాన్ చెరు పాఠశాల పూర్వ విద్యార్థుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం పటాన్ చెరు లోని ఫ్రీడం పార్కు నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహ అధ్యక్షులు వై.అశోక్ కుమార్, జిల్లా అధ్యక్షులు ఎం.సోమ శేఖర్, మాజీ శాసనసభ్యులు సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నరసింహ రెడ్డి, పూర్వ విద్యార్థులు బైండ్ల కుమార్, శ్రీనివాస్ గుప్తాలు మాట్లాడుతూ.. సుమారు 50 సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాలగా వెలుగొంది వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాల స్థలానికి ఇలాంటి దుస్థితి రావడం శోచనీయమని అన్నారు. 13 ఏళ్ల క్రితం పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని విద్యార్థులను తాత్కాలికంగా ప్రాథమిక పాఠశాల భవనానికి తరలించి ఇన్నేళ్ళయినా నూతన భవనం నిర్మించకుండా ఇరుకైన ఆటస్థలం లేని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోనే ఉన్నత పాఠశాలను కొనసాగించడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవకాశం దొరికినప్పుడల్లా ఆ స్థలాన్ని ఆక్రమించుకోవాలని కొందరు ప్రయత్నించడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నామన్నారు. సుప్రీమ్ కోర్టు అనుమతితో నిర్మించిన ప్రహరీ గోడను రాత్రికి రాత్రి కూల్చి వేయడం చాలా దారుణమని అన్నారు. కాంపౌండ్ వాల్ కూలుస్తుంటే పాత భవనం నేలమట్టమైందని తప్పుడు నివేదిక ఇవ్వడం అక్షేపనీయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యత తీసుకుని సుప్రీం కోర్టులో సమర్థుడైన లాయర్ ను నియమించి ఆ స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని కోర్టు అనుమతితో కాంపౌండ్ వాల్ నిర్మించినట్టే అదే స్థలంలో సిఎస్ఆర్ నిధులతో హై స్కూల్ భవనాన్ని నిర్మించి విద్యార్థుల భవిష్యత్తుకు మార్గం సుగమం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆక్రమించి గుడారాలు ఏర్పాటు చేసుకున్న 9 గుంటల పాఠశాల స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని జిల్లా అధికారులను డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమ శేఖర్, ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్, జిల్లా నాయకులు రాజారెడ్డి, సంజీవయ్య, అశోక్, నాసర్ పటేల్, శ్రీనివాస్ చారి, ప్రకాష్ రావు, మల్లికార్జున్, జనార్దన్, రాజు, సంతోష్, గోవింద్ రెడ్డి, విద్యాసాగర్, పోచయ్య, జయరామ్ రెడ్డి, టీఎస్ఈసీ నాయకులు లక్ష్మి, మానస, శ్రీధర్ మహేంద్ర, మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు బి.ముత్యాలు, పటాన్ చెరు నియోజకవర్గ నాయకులు ఆశిష్ గౌడ్, బి.విజయ్ కుమార్, ఆర్వీఎస్ రవి, ఎం.రామ్మోహన్, బిట్టు నరహరి, అంగడి బాలరాజు, సరస్వతి, పద్మ, నరేష్, రాజశేఖర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు రమేష్, నర్సింలు, నాగభూషణం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## బిడిఎల్ భానూర్ సిఐఎస్ఎఫ్ యూనిట్‌లో అగ్నిమాపక సేవా దినోత్సవ వేడుకలు



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** బిడిఎల్ భానూర్ సిఐఎస్ఎఫ్ యూనిట్‌లో బుధవారం జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బిడిఎల్ భానూర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.కిషన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అసిస్టెంట్ కమాండెంట్, ఫైర్ అర్షద్ అలీ ఖాన్ ముఖ్య అతిథికి హాజరైన ఇతర ప్రముఖులకు స్వాగతం పలికారు .ఈ కార్యక్రమంలో 1944 సంవత్సరంలో బాంబే డాక్‌యార్డ్‌లో,ఆ తర్వాతి సంవత్సరాలలో జరిగిన అగ్నిప్రమాదాలలో మరణించిన అగ్నిమాపక సిబ్బందికి షహీద్ స్మారక్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.అనంతరం అక్కడికి వచ్చిన ఇతర అధికారులు, ప్లాంట్ ఉద్యోగులు కూడా పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 14 ఏప్రిల్ 2026 నుండి 14 ఏప్రిల్ 2026 వరకు గల అగ్నిమాపక నివేదికను యూనిట్ కమాండర్ డిప్యూటీ కమాండెంట్ సి.శ్రీరామ్ తేజస్వి సమర్పించారు. బిడిఎల్ భానూర్ సిఐఎస్ఎఫ్ యూనిట్ యొక్క ఫైర్ వింగ్, నేడు ప్రారంభించబడుతున్న అగ్నిమాపక సేవా వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా బిడిఎల్ భానూర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.కిషన్ మాట్లాడుతూ..ప్లాంట్ ఉద్యోగులు, సాధారణ పౌరులు,ఇతరులకు అగ్ని భద్రతపై అవగాహన కల్పించడమే అగ్నిమాపక సేవా వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. గతంలో జరిగిన వివిధ రకాల అగ్ని ప్రమాదాలను వివరిస్తూ,అగ్ని భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు,మార్గదర్శకాలను మన ఆచరణాత్మక జీవితాలలో అలవర్చుకున్నప్పుడే అగ్నిమాపక సిబ్బందికి నిజమైన నివాళి అర్పించగలమని అన్నారు. అటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేలా లేదా వాటి సంఖ్య తగ్గేలా మనం చర్యలు తీసుకోవాలి.ఈ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా, భానూర్‌లోని బీడీఎల్ సీఐఎస్ఎఫ్ యూనిట్ అగ్ని భద్రతపై వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆయన తెలియజేశారు. భానూర్‌లోని బీడీఎల్ సీఐఎస్ఎఫ్ యూనిట్ యొక్క ఫైర్ వింగ్, బీడీఎల్ భానూర్‌లోని డీఏవీ పాఠశాల, ఎద్దుమైలారంలోని పీఎంకేవీ ఓడీఎఫ్ పాఠశాల, భానూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల సిబ్బంది, పిల్లల కోసం వివిధ పోటీలతో పాటు ప్రథమ చికిత్స మరియు అగ్నిమాపక శిక్షణను నిర్వహిస్తోంది. ఇంకా బీడీఎల్ ఆసుపత్రి, ప్లాంట్ సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులు, సీఐఎస్ఎఫ్ భద్రతా విభాగం దళ సభ్యులు, సీఐఎస్ఎఫ్, బీడీఎల్‌కు చెందిన మహిళా గృహిణుల కోసం కూడా ఈ శిక్షణలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో వారి ఇంటి భద్రత గురించి, అగ్ని ప్రమాదాలకు గల కారణాల గురించి, వాటిని వారి సొంత స్థాయిలో ఎలా ఆర్పివేయాలో సమాచారం ఇవ్వబడుతుంది. సిఐఎస్ఎఫ్ అగ్నిమాపక విభాగం పనితీరును అభినందించారు. ఆ విభాగంపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా, సిఐఎస్ఎఫ్ కు అవసరమైన అన్ని ఆధునిక, అత్యాధునిక అగ్నిమాపక పరికరాలను బీడీఎల్ భానూర్ యాజమాన్యం సమకూరుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## సంభాషణ, ప్రభావంపై గీతంలో కార్యశాల



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని విద్యా ఆవిష్కరణ, పురోగతి కేంద్రం (సీఏఐఏ) ఏప్రిల్ 21న ఉదయం 9.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు 'సంభాషణ, ప్రభావం'పై ఒకరోజు స్వీయ నైపుణ్యాల పెంపుదల కార్యశాలను నిర్వహించనుంది. సీఏఐఏకు చెందిన మోసెస్ కొటికెల ప్రకారం, విద్యా వాతావరణాలలో ఒక కీలకమైన నాయకత్వ సామర్థ్యాన్ని, అంటే, ప్రభావితం చేయగల సామర్థ్యంతో కూడిన సమర్థవంతమైన సంభాషణను బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం రూపొందించినట్టు తెలిపారు.ఈ నైపుణ్యాలు విశ్వవిద్యాలయ నాయకులకు విభిన్న భాగస్వాములను ఏకం చేయడానికి, విశ్వాసాన్ని పెంపొందించడానికి, సంస్థాగత దృక్పథాన్ని సమన్వయ చర్యలుగా మార్చడానికి వీలు కల్పిస్తాయన్నారు. సంక్లిష్టమైన విద్యా వ్యవస్థలలో మార్పును తీసుకురావడానికి, విభేదాలను పరిష్కరించడానికి, సహకారాన్ని పెంపొందించడానికి, వ్యక్తులను ప్రేరేపించడానికి కూడా ఇవి చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయం యొక్క మేధోపరమైన గుర్తింపునకు బ్రాండ్ అంబాసిడర్లుగా నాయకులు పనిచేస్తారని గుర్తిస్తూ, అధ్యాపకులు, విద్యా నాయకులు తరగతి గదులు,సమావేశాలు, సహకారాలు, విద్యార్థుల కార్యక్రమాలలో సంస్థ ప్రాతినిధ్యాన్ని మెరుగుపరచడంపై ఈ కార్యశాల దృష్టి సారిస్తుందని తెలియజేశారు.ఈ కార్యశాలలో,ఉపన్యాసాలు, ప్రజెంటేషన్లు, విద్యాసంబంధ చర్చలను మరింత ఆసక్తికంగా, ప్రభావవంతంగా మార్చే లక్ష్యంతో 'అకడమిక్ ఇంపాక్ట్ కోసం కథలు చెప్పడం' అనే అంశంపై ఒక మాస్టర్ క్లాస్ ఉంటుందన్నారు. ఇందులో పాల్గొనేవారు జాతీయ, అంతర్జాతీయ విద్యా వేదికలలో సంస్థాగత బలాలను సమర్థవంతంగా వ్యక్తీకరించడం, ప్రదర్శించడం కూడా నేర్చుకుంటారని వివరించారు. దీనికి అదనంగా,ఈ కార్యక్రమం తరగతి గదిలో భాగస్వామ్యాన్ని పెంచడానికి, విషయ నైపుణ్యానికి అతీతంగా అభ్యాస అనుభవాలను సుసంపన్నం చేయడానికి ఆచరణాత్మక వ్యూహాలను పరిచయం చేస్తుందని తెలిపారు.ఈ కార్యశాలలో కోహెన్‌బ్రాడ్ ఫోర్డ్ ప్రభావ నమూనాని అనువర్తించడం ఒక కీలక అంశంగా ఉంటుందన్నారు. ఇది విద్యాసంబంధిత కార్యక్రమాలలో సమన్వయం, విశ్వసనీయతను పెంపొందించడానికి, పాల్గొనేవారికి సానుభూతి పటాలు, ప్రభావ విలువలను అర్థం చేసుకోవడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం సంస్థాగత సందర్భాలకు అనుగుణంగా చర్చలు, వాస్తవ జీవిత దృశ్యాలు, ఆత్మపరిశీలన వ్యాయామాలను మిళితం చేస్తూ, అత్యంత ముఖాముఖిగా ఉంటుందన్నారు. ఐటీ, తయారీ, బీఎఫ్ఎస్ఐ, ఫార్మాస్యూటికల్స్, జీసీసీలు, విద్యారంగంతో సహా పలు రంగాలలో 26 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న నాయకత్వం, ప్రవర్తనా సలహాదారు జుజర్ శుక్లా హస్టక్ ఈ కార్యశాలలో ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు.వ్యక్తులు, సంస్థలు తమ అత్యున్నత సామర్థ్యాన్ని గ్రహించేలా చేయడంలో బలమైన దృష్టితో, ఆమె ఆచరణాత్మక అంతర్దృష్టులు, ప్రతిబింబిత అభ్యాస పద్ధతుల యొక్క విశిష్టమైన సమ్మేళనాన్ని తీసుకొస్తారని వివరించారు.



## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**కోటగిరి ఎస్ఐ సునీల్**

**కోటగిరి మండల కేంద్రంలో రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించిన ఎస్ఐ**

**కోటగిరి,దీక్ష ప్రభ:** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కోటగిరి ఎస్సై సునీల్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమల అవశ్యకత రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్త పై స్థానిక నాయకులు ప్రజలతో ప్రార్థన చేయించారు. అనంతరం ఎస్సై సునీల్ మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని అన్నారు. బైక్ పై వెళ్లేటప్పుడు తలకు హెల్మెట్ ధరించాలని కార్ డ్రైవింగ్ చేసేటప్పుడు సీటు బెల్టు పెట్టుకొని ప్రయాణాలు చేయాలని ఆయన పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడపవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబం కోసం రెండు బదులుతా నియమాలు పాటించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు,కోటగిరి సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు బర్ల మధుకర్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, కొత్తపల్లి సర్పంచ్ పుప్పల గంగారం, దళిత సంఘాల నాయకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## హకీమ్ లాంటి వ్యక్తి పోతంగల్ మండలానికి గర్వ కారణం

- పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండే హకీమ్ వ్యక్తిత్వం చాలా గొప్పది
- హంగర్గా ఫారంలో జిల్లా ర్యాంకర్ ను సన్మానించిన హకీమ్
- చేతన్ నగర్ గ్రామంలో నిరుపేద వ్యక్తికి ఆర్థిక సహాయం అందజేసిన డాక్టర్. ఎంఏ.హకీమ్





**పోతంగల్,దీక్ష ప్రభ:** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హంగర్గా ఫారం గ్రామానికి చెందిన ఆదిల్ అన్సార్ కు చదువులో మంచి ప్రతిభ ఉన్నప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నిజామాబాద్ లోని ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి జిల్లా స్థాయిలో బైపిసి గ్రూప్లో ఐదవ ర్యాంకు సాధించిన విషయం తెలుసుకున్న ప్రముఖ సామాజిక సేవాకర్త డాక్టర్.ఎంఏ.హకీమ్సోమవారము ఆదిల్ అన్సార్, అతని తల్లిదండ్రులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలోని చేతన్ నగర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన యోగాజి అనే వ్యక్తి అనారోగ్యం పాలై చికిత్స పొందుతున్నందున ఆయనకు డాక్టర్.హకీమ్ అండగా నిలిచారు. గ్రామ సర్పంచ్ సునీల్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో ఆర్థిక అవసరాలకు ఆసుపత్రి ఖర్చులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల సీనియర్ నాయకులు ఎజాస్ ఖాన్ మాట్లాడుతూ....పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆసరా, అభినందన, విద్యా, వైద్యం, ఆరోగ్యం వంటి సందర్భం ఏదైనా వారికి అండగా ఉండే ఏకైక నాయకుడు డాక్టర్ హకీమ్ అని ఉమ్మడి కోటగిరి మండల సీనియర్ నాయకుడు ఎజాస్ ఖాన్ గుర్తు చేశారు. డాక్టర్ హకీమ్ లాంటి నాయకులు పోతంగల్ మండలంలో ఉండడం మండలానికి గర్వకారణమని అన్నారు. నిత్యం పేద ప్రజల అవసరాల గురించి ఆలోచిస్తూ వారికి అండగా ఉండటం అభినందించదగ్గ విషయమని చెప్పారు. మండలంలో పేద ప్రజలకు అండగా నిలుస్తున్న హకీంకు ధన్యవాదాలు తెలిపారు. హకీమ్ లాంటి గొప్ప వ్యక్తులకు ఆ భగవంతుడు మంచి భవిష్యత్తును ప్రసాదించాలని ఆయన ముమ్ముందు మరిన్ని సేవలు ప్రజలకు అందించాలని కోరారు.ఈ సందర్భంగా డాక్టర్ హకీమ్ ను చేతన్ నగర్ సర్పంచ్ సునీల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చైతన్ నగర్ సర్పంచ్ సునీల్, ఉప సర్పంచ్ నర్సింలు,నాయకులు షేరు, ఎజాస్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన పెంచే ఉద్దేశమే అరైవ్ అలైవ్

- ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు
- నందిగామ గ్రామంలోని ఎస్.ఎన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ
- ట్రాఫిక్ నియమాలు పాటించండి
- సురక్షితంగా ప్రయాణించండి
- సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం మూడవ రోజు సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం నందిగామ గ్రామంలోని ఎస్.ఎన్. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే ఉద్దేశంతో వారం రోజుల పాటు "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నియమాలపై అవగాహన తప్పనిసరి అని అన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించి, పరిమిత వేగంతో ప్రయాణించాలని సూచించారు. అతివేగం క్షణకాలం ఆనందాన్ని కలిగించినప్పటికీ, ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబ యజమానిని కోల్పోతే ఆ కుటుంబం ఎంతటి కష్టాల్లో పడుతుందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని అన్నారు. గమ్యాన్ని చేరుకోవడం ఎంత ముఖ్యమో, దానిని సురక్షితంగా చేరుకోవడం అంతకంటే ముఖ్యమని తెలిపారు. ప్రత్యేకంగా యువతపై దృష్టి సారిస్తూ, కొత్త, కొత్త బైకులు ఉన్నప్పటికీ హెల్మెట్ ధరించకపోవడం, జుట్టు చెడిపోతుందనే కారణాలతో నిర్లక్ష్యం చేయడం వలన ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఏ పరిస్థితుల్లోనూ హెల్మెట్ లేకుండా ప్రయాణించకూడదని, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించకూడదని సూచించారు. ఈ సందర్భంగా యువతకు ఐఎస్ఐ గుర్తింపు పొందిన హెల్మెట్లు పంపిణీ చేశారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమాలలో యువత అధిక సంఖ్యలో పాల్గొని ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్సి జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, భానూర్ ఇన్స్పెక్టర్ విజయకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మెన్ శివానందం, నందిగామ సర్పంచ్ విక్రమ్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, డ్వాక్రా సంఘాల మహిళలు, పరిశ్రమల ఉద్యోగులు, ఆటో డ్రైవర్లు, యువత పాల్గొన్నారు.

# అంబేద్కర్ వ్యక్తి కాదు శక్తి!

- సమస్త భారతావనికి రాజ్యాంగం ద్వారా దారి చూపిన మార్గదర్శి
- సామాజిక సేవాకర్త డాక్టర్. ఎంఏ.హకీమ్



**పోతంగల్,దీక్ష ప్రభ:** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండలంలోని కొత్తగా ఏర్పడ్డ గ్రామపంచాయతీ పాత జల్లా పల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారము ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సుంకులత రవీందర్ చేతుల మీదుగా పంచశీల జెండాను ఎగరవేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జయంతి వేడుకల్లో పాల్గొన్న కోటగిరి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బర్ల మధుకర్, గ్రామ సర్పంచ్ సుంకులత, ఉప సర్పంచ్ సికిందర్, కొత్తపల్లి సర్పంచ్ గంగారం, తదితర దళిత సంఘాల నాయకులకు జల్లపల్లి ఫారం గ్రామానికి చెందిన సమాజసేవకర్త డాక్టర్.ఎంఏ. హకీమ్ శాలువాతో సత్కరించి అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సమాజసేవకర్త డాక్టర్ ఎంఏ హకీమ్ తో పాటు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ...అంబేద్కర్ కేవలం వ్యక్తి కాదని సమస్త భారతవనికి రాజ్యాంగం ద్వారా దారి చూపిన శక్తి అని అన్నారు. ముఖ్యంగా మహిళలు కూలీలు అనగారిన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని వారు పేర్కొన్నారు. ప్రపంచ మేధావిగా పేరు పొందిన అంబేద్కర్ భారత్ మాత బిడ్డ అవడం భారతీయులంతా గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అంబెద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం దేశానికి గర్వ కారణం అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుంకులత రవీందర్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ప్రవీణ్ ,ఉపాధ్యక్షులు సుభాష్, ఉప సర్పంచ్ సికిందర్,కోటగిరి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బర్ల మధుకర్, జల్లపల్లి అబాది సర్పంచ్ బర్మవత్ వివేక్, కొత్తపల్లి సర్పంచ్ పూప్పల గంగారం, బాన్సువాడ నియోజకవర్గ మాల సంగం అధ్యక్షుడు మిర్జాపూర్ చిన్న సాయన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సోంపూర్ కే. పోచీరం, రాష్ట్ర నాయకులు కన్నం దావులయ్య,లయ్య,కోటగిరి అంబెద్కర్ సంఘం అధ్యక్షులు బేగరి రాములు, కొత్తపల్లి రవి శివశంకర్ సాయికుమార్, జల్లపల్లి గ్రామ వార్డు సభ్యులు నాగమణి సురేష్ లక్ష్మి,రేణి రాములు తదితరులు పాల్గొన్నారు.



## హెగ్డోలి గ్రామంలో కొనసాగుతున్న
# అఖండ శివనామ సప్తాహ

- సప్తాహ సందర్భంగా అన్న ప్రసాద వితరణ చేసిన సర్పంచ్ నాగరాజు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుడిమెట్ మహదేవ్ మహారాజ్



**పోతంగల్,దీక్ష ప్రభ:** హెగ్డోలి గ్రామంలో గత 20 సంవత్సరాలుగా అఖండ శివనామ సప్తః నిర్వహిస్తున్నామని గ్రామ పూజారి మన్మథ్ స్వామి అన్నారు. హెక్డోలి గ్రామంలో నిర్వహిస్తున్న అఖండ శివనామ సప్తాహ బుధవారం నాలుగవ రోజు ఘనంగా కొనసాగింది. భక్తుల భజనలు కీర్తనలు నడుమ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. శివనామ సప్తః సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం శివనామ కీర్తనలతో మార్మోగింది. బుధవారం స్థానిక సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో సప్తాహ లో పాల్గొన్న భక్తులకు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. బుధవారం ముఖ్యఅతిథిగా గుడిమెట్ మహాదేవ్ మహారాజ్ పాల్గొని భక్తులకు ప్రవచనం చెప్పారు. సర్పంచ్ దంపతులను ఆశీర్వదించి దీవెనలు అందించారు.ఈ సందర్భంగా గ్రామ పూజారి మన్మథ్ స్వామి మాట్లాడుతూ.. గ్రామంలో గత 20 సంవత్సరాలుగా గ్రామస్తుల సహకారంతో అఖండ శివనామ సప్తాహ నిర్విరామంగా కొనసాగుతుందని చెప్పారు. సప్తహ ద్వారా భగవంతుని ఆశీర్వాదంతో గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని, పిల్లా పాపలు క్షేమంగా ఉంటారని అన్నారు.గ్రామ సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు,ఉప సర్పంచ్ సంజు,గ్రామ పురోహితులు మన్మథ్ స్వామి,గ్రామ పెద్దలు, గుడిమెట్ మహాదేవ్ మహారాజ్,లింగాయత్ కమిటీ అధ్యక్షుడు రాంబాబు, నాగం సాయిలు,రాచప్ప,అర్జున్ పటేల్,యాదవురావు తదితరులు పాల్గొన్నారు.

## పోతంగల్ మండల కేంద్రంలో
# చలివేంద్రం ప్రారంభం

- గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు
- చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ కల్లూరి సంధ్య హనుమాన్లు



**కోటగిరి,దీక్ష ప్రభ:** వేసవి తాపం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం పోతంగల్ మండల కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ కల్లూరి సంధ్య హనుమాన్లు తెలిపారు. సోమవారం పోతంగల్ మండల కేంద్రంలోనీ పోతంగల్ బస్టాండ్ ప్రాంగణం నందు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ కల్లూరి సంధ్యా హన్మండ్లు, ఉప సర్పంచ్ నబి సహా పాలక వర్గం సభ్యులతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్,ఉప సర్పంచ్,కార్యదర్శి మాట్లాడుతూ..పోతంగల్ మండల కేంద్రానికి ఆయా పనుల నిమిత్తం వచ్చే చుట్టుపక్కల గ్రామ ప్రజలే కాక మహారాష్ట్ర ప్రాంత వాసులకు కూడా ఈ మంచి నీటి చలివేంద్రం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంతో ప్రయాణికుల దాహార్తిని ఈ చలివేంద్రం ద్వారా తీర్చుకోవచ్చని చెప్పారు.ఈ చలివేంద్రం ప్రారంభోత్సవంలో ఉప సర్పంచ్ నభీ,సెక్రటరీ యాదవ్,వార్డ్ సభ్యులు సంతు పటేల్,నెరోల్ల పోశట్టి,తోకల శేఖర్,గజ్జెల శివ,పంచరెడ్డి అనిల్,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జుమ్మఖాన్, నాయకులు ఓమన్న పటేల్,సుదం నాగభూషణం, బుడేమల శంకర్,అబ్బయ్య,కారోబార్ నాగేష్,గ్రామ పంచాయతీ సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.



# టాక్లిలో ఉచిత వైద్య శిబిరం

- మహిళలకు చీరలు పంపిణీ చేసిన సర్పంచ్ పద్మావతి సాయికిరణ్
- టాక్లి గ్రామంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**పోతంగల్,దీక్ష ప్రభ:** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం లోని కొత్తగా ఏర్పడ్డ పోతంగల్ మండలంలోని టాక్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కే.ప్రకాష్,పంచశీల జెండాను ఎగరవేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పద్మావతి సాయికిరణ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ మేడికవర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే మహిళలకు కానుకగా చీరలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నిజామాబాద్ మెడికల్ హాస్పిటల్ డాక్టర్ మనోజ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ పద్మావతి సాయికుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు.ఈ శిబిరంలో 120 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మగరే పద్మావతి సాయికిరణ్,ఉప సర్పంచ్ సురేఖ జ్యోతి పాల్,యూరాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ అజయ్ కుమార్ విశ్వనాథ్ పటేల్,జీవన్ రావు పటేల్, ప్రకాష్ గంగాధర్,సమాజసేవ కర్త డాక్టర్ ఎంఏ హకీమ్,రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు డాక్టర్ నాగయ్య,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా
# నియమాలు పాటించాలి

- కోటగిరి ఎస్ఐ సునీల్
- కోటగిరి మండల కేంద్రంలో రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించిన ఎస్ఐ

**కోటగిరి,దీక్ష ప్రభ:** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కోటగిరి ఎస్సై సునీల్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమల అవశ్యకత రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్త పై స్థానిక నాయకులు ప్రజలతో ప్రార్థన చేయించారు. అనంతరం ఎస్సై సునీల్ మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని అన్నారు. బైక్ పై వెళ్లేటప్పుడు తలకు హెల్మెట్ ధరించాలని కార్ డ్రైవింగ్ చేసేటప్పుడు సీటు బెల్టు పెట్టుకొని ప్రయాణాలు చేయాలని ఆయన పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడపవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబం కోసం రెండు బదులుతా నియమాలు పాటించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు,కోటగిరి సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు బర్ల మధుకర్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, కొత్తపల్లి సర్పంచ్ పుప్పల గంగారం, దళిత సంఘాల నాయకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



# పటాన్ చెరులో భారీ మోసం

- గొలుసుకట్టు పథకం పేరుతో కోటి 60 లక్షల రూపాయలు వసూలు
- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** ఐదు లక్షల రూపాయలు పెట్టుబడి పెడితే నెలకు 25 వేల రూపాయల చొప్పున 40 నెలల పాటు చెల్లించడంతోపాటు నూట పది గజాల స్థలం ఇస్తామంటూ వినియోగదారులను నిండా ముంచిన సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పట్టణంలో చోటు చేసుకుంది. తమకు న్యాయం చేయాలంటూ బాధితులు మీడియా ముందు వాపోయారు. బుధవారం పటాన్ చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ గోడును వెళ్లబోసుకున్నారు. పటాన్ చెరు పట్టణంలో గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న హేమకాంత్ రెడ్డి గత ఏడు సంవత్సరాలుగా వెస్టీజ్ అనే గొలుసుకట్టు సంస్థలో చేరి వందలాది మందిని సభ్యులుగా చేర్చి లక్షల రూపాయలు గడించాడు. కోట్ల రూపాయలు సంపాదించాలన్న దురుద్దేశంతో తనను నమ్మిన సభ్యులను మోసం చేసేందుకు కొత్త పథకాన్ని ప్రారంభించాడు. 2025లో శుభక్షేత్ర ప్రాజెక్ట్ పేరుతో తన పథకాన్ని ప్రారంభించాడు. ఐదు లక్షల రూపాయలు పెట్టుబడి పెడితే నెలకు 25 వేల రూపాయల చొప్పున 42 నెలలు చెల్లించడంతో పాటు నారాయణఖేడ్ సమీపంలోని దామారగిద్ద గ్రామంలో 102 గజాల ప్లాటు ఇస్తానని నమ్మబలికాడు. అంతేగాక కట్టినవారు మరొకరి చేత ఐదు లక్షల రూపాయలు కట్టిస్తే 5 వేల రూపాయల చొప్పున కమిషన్ చెల్లిస్తానని నమ్మబలికారు. తమతో కలిసి పనిచేసిన వ్యక్తి కావడంతో 32 మంది బాధితులు ఒక కోటి 60 లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టారు. కొన్ని నెలలు ప్రతినెలా కమిషన్ చెల్లిస్తూ తదనంతరం సాకులు చెబుతూ తప్పించుకుంటూ తిరగడం ప్రారంభించాడు. అనుమానం వచ్చి ఇంటికి వెళ్లి నిలదీస్తే ఏకంగా మకాం మార్చేసాడు. ఇదిలా ఉండగా పటాన్ చెరుతో పాటు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 130 మంది నుండి 7 కోట్ల రూపాయలు వరకు డిపాజిట్లు సేకరించి తప్పించుకొని తిరుగుతున్నాడని బాధితులు తెలిపారు. తమకు ఎలాగైనా న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసుకి సింగర్ మంగ్లీ కి ఎటువంటి సంబంధం లేదని, అంతా హేమకాంత్ రెడ్డి నేతృత్వంలోనే మోసం జరిగిందని వారు తెలిపారు.

Printed,Published,Edited, & owned by **Rathod Vinod Kumar** Published from **SNEHITHA PUBLICATIONS** Falcon Printing press, # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code :502220, Printed At Falcon Printing Press # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code: 502220, Editor: **Rathod Vinod Kumar**. RNI NO. TELTEL/2023/87655,Cell : 9550021491,7893532721, Gmail: deekshaprabhatelugudaily@gmail.com